క్లుప్తంగా

వైభవంగా లక్ష్మీనరసింహ స్వామి గరుడసేవ



లక్ష్మీనరసింహస్వామి గరుడ సేవ ఉత్సవం

రాయదుర్గంటౌన్: మల్లాపురం విప్రమలై క్షేత్రంలో వెలసిన లక్ష్మీ నవ నారసింహస్వామి గరుడ సేవ ఉత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు రామ్మూర్తి స్వామీజీ ఆధ్వర్యంలో స్వామికి సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ, నైవేద్య పూజలు జరిపించారు. అనంతరం స్వామి గరుడ సేవ ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఉంచి ఊరేగించారు. భక్తులకు అన్నదాన చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బీఎస్ తిప్పే స్వామి, ఉపాధ్యక్షుడు ధర్మన్న, కోశాధికారి సత్యనారాయణ, నరసింహులు, కార్యదర్శి గురు, కోశాధికారి వెంకటేశులు, సభ్యులు కమలాక్షుడు, గురునాథరెడ్డి, రామిరెడ్డి, వెంకటరెడ్డి, ఆనంద రెడ్డి, చౌడప్ప, వెంకటేశులు పాల్గొన్నారు.

పగిలిపోయిన సత్యసాయి తాగునీటి పైపు

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం- కంబదూరు ప్రధాన రహదారి నారాయణపురం గేట్ వద్ద శనివారం సత్యసాయి తాగునీటి పథకం పైపులైన్ పగిలిపోయింది. దీంతో తాగునీరు భారీగా వృథా అయ్యింది. రహదారి పక్కనే కేబుల్ నెట్ వర్క్ పనులు జరుగుతుండగా, పైపులైన్ ధ్వంసమైనట్లు స్థానికులు తెలిపారు. అధికారులు, సిబ్బంది మరమ్మతు చర్యలు చేపట్టారు.

ఎస్ఎఫ్ఐ రాయదుర్గం పట్టణ కమిటీ ఎన్నిక

రాయదుర్గంటౌన్: రాయదుర్గం పట్టణ కమిటీ ఎస్ఎఫ్ఐ నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జరిగిన సమావేశంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బంగి శివ ఆధ్వర్యంలో కమిటీ ఎన్నిక జరిగింది. కమిటీ అధ్యక్షుడుగా గౌతమ్, కార్యదర్శిగా మహమ్మద్ వలి, ఉపాధ్యక్షుడిగా సాయి జశ్వంత్, అల్తాఫ్, అనిల్, సహాయ కార్యదర్శులుగా రాజేష్, అభి, కిరణ్, అరవింద్, సభ్యులుగా నవీన్, పవన్, రాజశేఖర్, జాన్, రంజిత్, గణేష్, జయకృష్ణ, ఇర్ఫాన్, చిన్నను ఎన్నుకున్నట్లు తెలిపారు.

తుంగభద్ర జలాలకు పూజ



పెన్నహోబిలంలో తుంగభద్ర జలాలకు గంగపూజ చేస్తున్న దృశ్యం

ఉరవకొండ: మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నాహోబిలంలో హెచ్చెల్సీ ద్వారా ఎంపీఆర్‌కు వెళ్తున్న తుంగభద్ర జలాలకు ఆలయ ఈఓ సాకే రమేష్‌బాబు, అర్చకులు ద్వారకా నాథ చార్యులు, బాలాజీస్వామి శనివారం పూజలు చేశారు. ఈఓ మాట్లాడుతూ దేవస్థానం చుట్టూ భక్తుల సౌకర్యార్థం కొత్తగా రెండు హైమాస్ లైట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నీటి సమస్యపై నిర్లక్ష్యం సరికాదు

రాయదుర్గంటౌన్: పట్టణంలో తాగునీటి సమస్యపై నిర్లక్ష్యం సరికాదని మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. శనివారం తన చాంబర్‌లో డీఈ సురేష్, ఏఈ నరసింహులుతో కలిసి అమెనిటీస్, ఇంజనీరింగ్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సిబ్బంది పద్ధతి మార్చుకోవాలని, తాగునీటి సమస్య పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వారం రోజుల్లోపు సచివాలయ సిబ్బందితో సమన్వయం చేసుకొని నీటి సమస్య ఉందో నివేదిక తయారు చేసి, పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అవసరమైన చోట్ల ట్యాంకర్లను సకాలంలో పంపించి,నీటి సమస్య పరిష్కరించాలన్నారు.

నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



హెవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటును పరిశీలిస్తున్న విద్యుత్‌శాఖ డీఈ రాజశేఖర్

బెళుగుప్ప: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను శనివారం ఏర్పాటు చేశారు. సబ్‌స్టేషన్‌లో 8.0 ఎంఎం హెవీ ట్రాన్స్‌ఫార్మర్ శుక్రవారం రాత్రి కాలిపోయింది. కళ్యాణదుర్గం డివిజన్ డీఈఈ రాజశేఖర్, ఏఈ గంగాధర్ ఆధ్వర్యంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి, అదే స్థానంలో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను శనివారం ఏర్పాటు చేయించారు. ఆదివారం నుంచి అన్ని గ్రామాల పీడర్లకు విద్యుత్ సప్లయ్ అవుతుందని ఏఈ గంగాధర్ తెలిపారు.

అక్రమ లేఅవుట్‌లను గుర్తించాం

కళ్యాణదుర్గం : ప్రభుత్వం అనర్హత లేఅవుట్‌లపై జీఓ 134 విడుదల చేసిందని మున్సిపల్ కమిషనర్ వంశీ భార్గవ్ అన్నారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో దాదాపు 34 అక్రమ లే అవుట్‌లను గుర్తించినట్లు వారు తెలిపారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలన్నారు.

అమ్మపాలు..అమృతం

- 7 వరకూ ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు
- శిశువు పుట్టిన అరగంటలోపు తల్లిపాలు పట్టించాలి
- తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది





రాయదుర్గంలో తల్లిపాల ప్రాముఖ్యతపై ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, చిన్నారులు, తల్లులు

రాయదుర్గంటౌన్: అమ్మపాలు అమృతమంటారు.. బిడ్డపుట్టిన క్షణం నుంచి ముర్రుపాలు తాపించడం శ్రేయస్కరం..తల్లిపాలతో బిడ్డకు ఆకలి తీరడమేకాకుండా వ్యాధినిరోధకశక్తి పెరుగుతుంది..అమ్మపాలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించడానికి మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాలను ఈనెల 1 నుంచి 7వ తేదీ వరకు నిర్వహిస్తున్న కార్యక్రమాలపై ప్రత్యేక కథనం.

తల్లిపాలతో ఎన్నో ఉపయోగాలు..

- మొదటి ఆరు నెలలు ఎలాంటి డబ్బా పాలు పట్టించకుండా, తల్లిపాలు మాత్రమే ఇవ్వాలి.
- సాధారణ ప్రసవం అయితే పుట్టిన అరగంటలోపు తల్లిపాలు పట్టించాలి. సిజేరియన్ అయితే నాలుగు గంటల లోపు ఇవ్వాలి.
- తల్లిపాలు వ్యాధి నిరోధక శక్తిని కూడా పెంపొందిస్తాయి.
- తల్లిపాలు మెదడు ఎదుగుదలకు దోహదం చేయడం వల్ల జ్ఞాపకశక్తి పెంపొందుతుంది.
- బిడ్డకు పాలిచ్చే మహిళల్లో బ్రెస్ట్ కేన్సర్, అండాశయ కేన్సర్, రక్తహీనత, ఎముకల బలహీనత వంటి జబ్బుల నుంచి రక్షణ పొందే అవకాశం ఉంది.
- ముర్రుపాలు వ్యాధి నిరోధక శక్తి పెంచడంతో పాటు, శిశువు జీర్ణాశయ అభివృద్ధికి దోహదపడే పదార్థాలు విటమిన్-ఏ అధిక మోతాదులో ఉంటాయి.
- తల్లిపాలలో సహజ సిద్ధమైన ప్రోటీన్లు, లాక్టోఫెరిన్, కోలోస్ట్రమ్, కొన్ని కీలకమైన హార్మోన్లు, రోగ నిరోధక బ్యాక్టీరియా ఉంటాయి.
- పసిబిడ్డకు ప్రధాన శత్రువు చలి, బిడ్డను ఒడిలో ఉంచుకొని పాలివ్వడం ద్వారా తల్లి శరీరం నుంచి శిశువుకు అవసరమైన వేడి అందుతుంది. తల్లీబిడ్డకు మధ్య అనుబంధం కూడా పెరుగుతుంది.

ముర్రుపాలు ..వ్యాధి నిరోధక టీకా



బిడ్డ పుట్టిన అరగంటలోపు తల్లిపాలు తాపించాలి. ఇది తల్లి స్వయంగా బిడ్డకు ఇచ్చే మొదటి వ్యాధి నిరోధక టీకా. ఆతర్వాత బిడ్డకు ఆరు నెలలు నిండే వరకూ తల్లిపాలు తాపించాలి. ఎండాకాలమైనా సరే చుక్క నీరు కూడా ఇవ్వాల్సిన అవసరం లేదు. తల్లిపాలు ఆరోగ్యకర జీవితానికి పోషణ పద్ధతి. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పోషణ్ కిట్స్‌తోపాటు మధువైన, సులువుగా జీర్ణమయ్యే పదార్థాలు సమయానుసారంగా పెంచుతూ బిడ్డకు రెండేళ్ల వరకు తల్లిపాలతో పాటు ఇవ్వాలి. ఈ పద్ధతులు పాటిస్తే బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటుంది.

– ఏఎల్ పద్మావతి, సీడీపీఓ, ఐసీడీఎస్ ప్రాజెక్ట్, రాయదుర్గం

అపోహలు మానుకోవాలి



బిడ్డ పుట్టిన అరగంటలోపు తల్లి మర్రుపాలు తాపించాలి. దీనిపై నేటికీ అపోహలు ఉన్నాయి. బిడ్డ పుట్టిన వెంటనే అరంగంటలోపు కచ్చితంగా ముర్రుపాలు తాపిస్తే ఆరోగ్యవంతంగా ఉంటాడు. శిశుమరణాలు సంఖ్య కూడా తగ్గుతుంది. తల్లిపాలు తాగిన పిల్లలు చురుగ్గా, తెలివితేటలతో ఉంటారు. బిడ్డకు పాలిచ్చే తల్లుల్లో బ్రెస్ట్ కేన్సర్ వచ్చే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయనేది కూడా అధ్యయనాల్లో తేలింది.

– మెర్సీ జ్ఞానసుధ, ఆస్పత్రి సూపరింటెండెంట్, రాయదుర్గం ఏరియా ఆస్పత్రి

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న ఉరవకొండ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ దుర్గా కళ్యాణి



రాయదుర్గం అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి రమ్య



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి కె. భాను

ఉరవకొండ: మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఉరవకొండ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ దుర్గా కళ్యాణి తెలిపారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో మండల లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో అథారిటీ చైర్‌పర్సన్, ఉరవకొండ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ దుర్గాకళ్యాణి ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మేజిస్ట్రేట్ మాట్లాడుతూ ఉచిత న్యాయ సహాయం, సీనియర్ సిటిజన్ హక్కులు మానసిక అనారోగ్యం, మేథో వైకల్యం ఉన్న వ్యక్తులను చట్టపరంగా సేవల పథకం ఉందన్నారు. గ్రాస్‌రూట్ లెవెల్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సేవలందించడమే లక్ష్యం

రాయదుర్గంటౌన్: సమాజంలోని బలహీన వర్గాలకు ఉచిత న్యాయ సేవలందించడమే లక్ష్యమని జూనియర్ సివిల్ జడ్జి, జాగృతి స్కీమ్ టీమ్ చైర్‌పర్సన్ ఎం.రమ్య పేర్కొన్నారు. శనివారం స్థానిక కోర్టులో నల్సా జాగృతి స్కీమ్‌పై ప్రజలతోపాటు టీమ్ సభ్యులతో అవగాహన సదస్సు నిర్వహించారు. జాగృతి స్కీమ్‌లో 14 మంది సభ్యులతో టీమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉచిత న్యాయ సేవలు, లోక్ అదాలత్ ద్వారా వివాదాల పరిష్కారం, ఉచిత న్యాయ సలహా, అవసరమైన వారికి కేసుల నమోదు సమాయం, ఫోక్సచట్టం, మహిళా చట్టాలపై వివరించారు. తహసీల్దార్ నాగరాజు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

సమాజ జాగృతి కోసం కృషి చేయాలి

బ్రహ్మసముద్రం: సమాజ జాగృతి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జూనియర్ సివిల్ జడ్జి కె. భాను తెలిపారు. శనివారం స్థానిక కోర్టు హాలులో పోలీసులు, న్యాయవాదులు, రెవెన్యూ సిబ్బంది, టౌన్ సీఐ , వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. అనంతరం జడ్జి మాట్లాడారు. కక్షిదారులు, యువత చెడు వ్యసనాలకు వెళ్లకుండా సరైన మార్గంలో వెళ్లేలా చైతన్య పరచాలన్నారు. సమావేశంలో టౌన్ సీఐ యువరాజు, డిపో మేనేజర్ రామచంద్ర, రెవెన్యూ సిబ్బంది, రిటైనల్ న్యాయవాది దాదా ఖలందర్, రామాంజినేయులు, అనిత, న్యాయవాదులు ముత్యాలప్ప, హరిచక్రవర్తి, కిరణ్ పాల్గొన్నారు.

పరిహారం ఇవ్వకపోతే ఆందోళనలు

- మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి



మెట్టు గోవిందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే

రాయదుర్గం: బొమ్మనహాళ్, కణేకల్లు, డి హీరేహాళ్ మండలాల్లోని హెచ్ఎల్‌సీ కింద గతేడాది సాగుచేసిన వరి, మొక్కజొన్న, పత్తి పంటలు అకాల వర్షాలు, ఈదురు గాలులతో దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని, పొలాల పరిశీలనకు వెళ్లిన ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పరిహారం ఇచ్చి ఆదుకుంటామని హామీ ఇచ్చి నేటికీ అతీగతీలేదని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి విమర్శించారు. రైతులకు పరిహారం ఇవ్వకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. శనివారం ఆయన మాట్లాడుతూ వడగండ్ల వర్షం, ఈదురు గాలల బీభత్సానికి చేతికంది వచ్చిన వరి పంట నేతకూలిందని, ధాన్యం కల్లాల్లో మొలకలు వచ్చాయన్నారు. ప్రభుత్వ మద్దతు ధరతో అరకొరగా కొనుగోలు చేసిన ధాన్యం డబ్బులు ఇచ్చేందుకు కూడా రైతులను ఇబ్బందులకు గురి చేశారన్నారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రైతులతో కలసి నష్టపోయిన ప్రతి రైతునూ ఓదార్చి ధైర్యం చెప్పామన్నారు. పరిహారం ఇవ్వాలని ప్రభుత్వంతో పాటు కలెక్టర్‌ను కోరినా పట్టించుకోలేదన్నారు. రైతులకు పరిహారం ఇప్పించడంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ తాత్సారం చేస్తున్నారని అన్నారు. పరిహారం ఇవ్వడంలో జాప్యం చేస్తే రైతులతో కలసి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అనేక కొర్రీలతో అన్నదాత సుఖీభవ పథకం కూడా చాలా మంది రైతులకు వర్తించలేదన్నారు. అర్హత ఉంటే చాలు.. ప్రతి రైతునూ రైతు భరోసా పథకం కింద ఏటా రూ.13,500 ఇచ్చి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదుకున్నారని గుర్తు చేశారు.

వైఎస్సార్‌సీపీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేద్దాం



బోరంపల్లి గ్రామంలో పార్టీ నేతలతో రంగయ్య

కళ్యాణదుర్గం రూరల్: వైఎస్సార్‌సీపీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేద్దామని పార్టీ నేతలకు సమన్వయకర్త తలారి రంగయ్య పిలుపునిచ్చారు. శనివారం పాతచేరువు, బోరంపల్లిలో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సమన్వయకర్త తలారి రంగయ్య , రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి మాట్లాడుతూ, రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక పార్టీ నేతలను వేధించడమే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత పేద, మధ్య తరగతి కుటుంబాల జీవితాలు అంధకారంలోకి వెళ్లాయన్నారు. ప్రభుత్వ మోసాన్ని ఇంటింటా తెలియజేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పార్టీ బలోపేతం కోసం గ్రామ కమిటీలను ఎంపిక చేశారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాడిపత్రి అనిల్‌రెడ్డి, మున్సిపాల్ చైర్మన్ రాజ్‌కుమార్, కౌన్సిలర్ పరమేశ్వరప్ప, కోఆప్షన్ మెంబర్ అబ్దుల్ రెహమాన్, సర్పంచ్ శోభారాణి, మండల కన్వీనర్లు గోళ్ల సూరి, హనుమతరాయుడు, ఎంఎస్ రాయుడు, చంద్రశేఖర్‌రెడ్డి, సుధీర్, నాయకులు ఎర్రంపల్లి కృష్ణమూర్తి, దొడగట్ట మురళి, ఆంజనేయులు, మల్లాపురం మల్లి, పాతలింగ, బోరంపల్లి రామిరెడ్డి, గోళ్ళమోహన్‌రెడ్డి, నాగలక్ష్మి, బోరంపల్లి అనిల్ కుమార్ రెడ్డి, బ్రహ్మయ్య, పోతేష్, గోవిందప్ప, నాగభూషణ్, కొండారెడ్డి, జయరామిరెడ్డి, మంజునాథ్‌రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, బలరాం, ఉదయ్, కేబీ మల్లికార్జున, కురువ వన్నూరస్వామి, ఎల్.అంజి, మారుతి, చరణ్‌రెడ్డి, గణేష్, శివన్న, సూరప్ప, గోవిందప్ప, మధు, బాబు, శ్రీరాములు, వెంకటేసులు, తిప్పేస్వామి, మల్లి పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని తిమ్మగానిపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు వడ్డే ఆంజనేయులు కుమార్తె వివాహ వేడుక శనివారం జరిగింది. కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య పాల్గొని, నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజ్‌కుమార్, మండల కన్వీనర్లు ఎంఎస్ హనుమంతురాయుడు, చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్సీ సెల్ తిప్పేస్వామి, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రంపల్లి కృష్ణమూర్తి, లాయర్ హనుమంతరెడ్డి, రామాంజనేయులు, రాము పాల్గొన్నారు.

రసాభాసగా సర్వసభ్య సమావేశం



కూడేరు: వైస్ ఎంపీపీ సుబ్బమ్మతో వాదనకు దిగిన సర్పంచ్ హనుమంతరెడ్డి

కూడేరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ నారాయణరెడ్డి అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం రసాభాసగా జరిగింది. ఉదయం 10:30 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం..సభ్యుల కోరం లేక గంట ఆలస్యంగా 11:30 గంటలకు ప్రారంభమైంది. వేదికపై వైస్ ఎంపీపీ సుబ్బమ్మ కూర్చోకూడదని, సమస్యలు పరిష్కరించేవారు మాత్రమే కూర్చోవాలని సర్పంచ్ హనుమంత రెడ్డి ప్రశ్నించారు. గత 16 సర్వ సభ్య సమావేశాల్లో వేదిక పైనే కూర్చున్నా..కొత్తగా అడ్డుకోవడమేమిటని వైస్ ఎంపీపీ ప్రశ్నించారు. దీంతో వైస్ ఎంపీపీ, సర్పంచు మధ్య మాటల యుద్ధం జరిగింది. ఎంపీపీ, ఇతర సర్పంచులు సర్దిచెప్పడంతో గొడవ సద్దుమణిగింది. ఆతర్వాత మరుట్ల, కొర్రకోడు, ఎంఎంహళ్లి, పి.నారాయణపురం గ్రామాలకు ఆర్టీసీ బస్సులను నడపాలని అధికారులను ఎంపీపీ, సర్పంచులు కోరారు. ముద్దలాపురంలో జగనన్న కాలనీకి నీరు సరఫరా చేయాలని, బ్రాహ్మణపల్లి, కమ్మూరు వద్ద తాగునీటి పైపులైన్‌కు లీకేజీలు అరికట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నాగదివ్యను కోరారు. ప్రధాన రహదారి పక్కన విద్యుత్ లైన్ ఏర్పాటు కోసం చెట్లు కొట్టడం సరికాదని ట్రాన్స్‌కో ఏఈ గౌస్‌ను సర్పంచులు ప్రశ్నించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ సుబ్బమ్మ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, ఎంపీడీఓ కుళ్లాయి స్వామి, హౌసింగ్ డీఈ హనుమప్ప , సీఎస్‌డీటీ శాంతకుమారి, డాక్టర్ ఉషారాణి, హార్టికల్చర్ ఆఫీసర్ యామిని, పశు వైద్యాధికారి శ్రీనివాసులు, ఏపీఓ పోలేరయ్య, ఏపీఎం దేవానంద ఫిలిప్సన్, ఏపీఓ పోలేరయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి విద్యావైజ్ఞానిక శిక్షణ

కణేకల్లు: నంద్యాలలో ఈనెల 4 నుంచి జరగనున్న విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులకు విద్యార్థులు భారీ సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లెల ప్రసాద్ కోరారు. శనివారం కణేకల్లులో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో తలపెట్టిన విద్యా, వైజ్ఞానిక శిక్షణ తరగతుల పోస్టర్లను విద్యార్థులతో కలిసి విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్య వ్యవస్థను ప్రైవేటీకరణ చేసేదిశగా చర్యలు ప్రారంభించాయని, దీన్ని పూర్తిగా వ్యతిరేకిస్తూ విద్యార్థుల్లో చైతన్యం కలిగించేందుకు విద్యా, వైజ్ఞానిక శిక్షణ తరగుతులు నిర్వహిస్తున్నామన్నారు.

నేమకల్లులో కిక్కిరిసిన భక్తులు



లక్షతులసీ అలంకరణలో నేమకల్లు ఆంజనేయుడు



కూడేరు: పూజలందుకున్న ఆంజనేయస్వామి



నేమకల్లు ఆలయ ప్రాంగణంలో దర్శనం కోసం క్యూ కట్టిన భక్తులు



గోనబావి గ్రామంలో ఊరేగుతున్న దుర్గమ్మదేవత

బొమ్మనహాళ్: నేమకల్లు ఆలయం భక్తులతో కిటకిటలాడింది. శావణమాసం రెండో శనివారం సందర్భంగా నేమకల్లు అంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. లక్ష తులసీమాల అలంకరణలో భక్తులకు నేమకల్లు అంజనేయ స్వామి దర్శనమిచ్చారు. కర్ణాటక, ఆంధ్ర ప్రాంతాల నుంచి అనేక మంది భక్తులు, ప్రజాప్రతినిధులు హనుమాన్ దర్శన్ బస్సులు, ప్రత్యేక వాహనాలు, ప్రైవేట్ వాహనాలు, ద్విచక్ర వాహనాలపై వేలాదిగా తరలివచ్చారు. ఆలయంలో ఉదయం నుంచి ప్రధాన అర్చకుడు అనిల్‌కుమార్ చార్యులు ఆధ్వర్యంలో స్వామికి పవిత్ర గంగాజలాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేక వెండి కవచ ధారణ, బంగారు కిరీటధారణ, వెండి తమలపాకు అలంకరణ, ఆకు పూజలు, ప్రత్యేక అలంకరణలు, విశేష లక్ష తులసీ అలంకరణ చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు, మహా మంగళహారతి, ప్రసాద వినియోగాలు చేశారు.

రెండో శనివారం పూజలు

గుమ్మఘట్ట:మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లో ఆంజనేయస్వామి, ఈశ్వర ఆలయాల్లో శ్రావణ మాసం రెండో శనివారం మహిళలు పెద్ద ఎత్తున పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. గోనబావి గ్రామంలో దుర్గమ్మ దేవతకు ప్రత్యేక పూజలు చేసి, గ్రామంలో మేళతాళాలతో ఊరేగించారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

కూడేరు: మండలంలోని బసాపురం, రామదుర్గం, కూడేరు, అంతరగంగ, ముద్దలాపురం ఆంజనేయ స్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆయా ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. పూజల్లో భక్తులు పాల్గొని ఆంజన్నను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. బసాపురంలో భక్తులకు అన్నదానం చేశారు.

గుండు నాగప్పకు పూజలు : కొర్రకోడులో గుండు నాగప్ప స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్థానికులే కాకుండా కర్ణాటక ప్రాంతం నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి గుండు నాగప్ప స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

తల్లిపాల వారోత్సవాలపై అవగాహన

కళ్యాణదుర్గం/రాయదుర్గంటౌన్/బొమ్మనహాళ్: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సీడీపీఓ లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలపై శనివారం అవగాహన కల్పించారు. కార్యక్రమానికి గైనకాలజిస్ట్ శశికళ, మున్సిపల్ కమిషనర్ లు హాజరై పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాధ, సిబ్బంది పాల్గొన్నారు.

రాయదుర్గం పట్టణంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించారు. సీడీపీఓ పద్మావతి ఆధ్వర్యంలో పైతోట బస్తీ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులు, బాలింతలకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరత్న, అంగన్‌వాడీ కార్యకర్త రోజా తదితరులు పాల్గొన్నారు.

- తల్లి పాలతోనే బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు గీతా, తిరుపాల్ బాయ్ అన్నారు. శనివారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బొమ్మనహాళ్ మండలం దర్గాహొన్నూరు, గోనేహాళ్‌లో అవగాహన ర్యాలీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వజ్రకరూరు: తల్లిపాలే బిడ్డకు శ్రీరామ రక్ష అని సూపర్‌వైజర్ రబియా అన్నారు. శనివారం పీసీ కొత్తకోటలోని రెండో అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ముందుగా గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు లోకమ్మ, అమీనా, గంగమ్మ, ఎర్రమ్మ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

గట్టు వెంకటరమణప్ప వర్ధంతి

ఉరవకొండ: స్థానిక పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న గాంధీ హరిజన హాస్టల్ వ్యవస్థాపకుడు, స్వాతంత్ర సమరయోధుడు గట్టు వెంకటరమణప్ప వర్ధంతి శనివారం నిర్వహించారు. గాంధీ హాస్టల్ కమిటీ సభ్యులు మీనుగ గోపాల్, కోనాపురం ఎర్రిస్వామి, చాబాల సర్పంచ్ జగదీష్ మాట్లాడారు. హరిజనోద్ధరణ కోసం 1933లో హరిజన హాస్టల్‌ను వెంకటరమణప్ప నిర్మించారన్నారు. దళితుల అభ్యున్నతికి వెంకటరమణప్ప ఎంతో కృషి చేశారన్నారు. అనంతరం వెంకటరమణప్ప విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో సురేష్, రామాంజనేయులు, రమేష్, నగేష్ పాల్గొన్నారు.

పింగళి వెంకయ్య జయంతి

ఉరవకొండ: వజ్రకరూర్ మండల పరిధిలోని రూపానాయక్ తండాలో పింగళి వెంకయ్య జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని భూక్య దేవాలయ ఆవరణలో బంజారా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పింగళి చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఫౌండేషన్ చైర్మన్ కమల్‌సింగ్ రాథోడ్ ఆధ్వర్యంలో గిరిజన యువకులు, గ్రామస్తులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నాయకులు భాను, రవి తేజ, రాజేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగం నిర్వీర్యం

ఉరవకొండ: కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత విద్యారంగాన్ని నిర్వీర్యం చేసిందని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్ విమర్శించారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మేజర్, మైనర్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలియజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా.. డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించలేదన్నారు. ఇంటర్ కళాశాల్లో పీడీలు లేకపోవడం విద్యార్థులకు క్రీడలకు దూరమయ్యారన్నారు.

ఎస్ఎఫ్ఐ కార్యదర్శిగా హరూన్ రషీద్:

ఎస్ఎఫ్ఐ నూతన కార్యదర్శిగా హరూన్ రషీద్, అధ్యక్షుడిగా రాజేష్ ఎంపికయ్యారు. ఉపాధ్యక్షుడిగా చిరంజీవి, కార్యదర్శిగా కార్తీక్, సిద్దార్థ తదితరుల ను జిల్లా ప్రధాన కార్యదర్శి సమక్షంలో ఎంపిక చేశారు.

నేడు ' బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ'

కణేకల్లు: పూలచెర్లలో ఆదివారం సాయంత్రం జరగనున్న 'బాబూ ష్యూరిటీ... మోసం గ్యారంటీ' కార్యక్రమంలో సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి పాల్గొంటున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పాటిల్ బ్రహ్మనందరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. 4 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

ఫసల్ బీమా గడువు పొడిగింపు

వజ్రకరూరు: ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన ప్రీమియం చెల్లింపు గడవు ఈనెల 14 వరకు ఉందని ఏఓ మధుకర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ జూలై 31 వరకు గడువు ఉండేదన్నారు.

సంక్షిప్త సమాచారం

7న పెన్నహోబిలంలో వేలం

ఉరవకొండ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలంలో ఈనెల 7న వేలంపాట నిర్వహిస్తున్నట్లుటాలయ ఈఓ సాకే రమేష్‌బాబు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. తలనీలాలు, కొబ్బరిచిప్పలు సేకరించుట, టెంకాయలు విక్రయించుటతో పాటు ఆలయంలో సప్లయర్స్ సామాన్లు సరఫరా చేయడం, భక్తులు సమర్పించిన బియ్యం, బేడలు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం

శెట్టూరు: బచ్చేహళ్లి వద్ద గుర్తుతెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేశారు. గ్రామానికి చెందిన రామంజనేయులు 15 ఎకరాల్లో మామిడి మొక్కలు నాటి విద్యుత్ కోసం రెండు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసుకున్నాడు. శుక్రవారం రాత్రి గుర్తుతెలియ వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి, అందులోని రాగి వైరు ఎత్తుకెళ్లారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సీపీఐ నూతన మండల కమిటీ ఎన్నిక

శెట్టూరు: మండలంలోని సీపీఐ మండల కమిటీ ఏకగ్రీవంగా ఎంపికైందని నియోజవర్గ కార్యదర్శి గోపాల్ తెలిపారు. మండల కార్యదర్శిగా అనుంపల్లి తిమ్మరాయుడు, సహాయ కార్యదర్శిగా ధనుంజయ, విశ్వనాథ రెడ్డిని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. జిల్లా అధ్యక్షుడు హనుమంతు, సీనియర్ నాయకుడు ఉప్పర శీనప్ప, జిల్లా సమితి సభ్యులు మహాదేవ, నాయకులు నరసింహప్ప, జయరాములు తదిరులు పాల్గొన్నారు.

రైతులు ఆర్ఎస్‌కేల్లో సంప్రదించండి

వజ్రకరూరు: అన్నదాత సుఖీభవ అనర్హులు ఆర్ఎస్‌కేల్లో సంప్ర దించాలని ఏఓ మధుకర్ తెలిపారు. శనివారం గంజికుంట ఆర్ఎస్‌కేలో ఆ యన మాట్లాడారు. మండలంలో 10,880 మందికి రూ.7.61 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. వీఏఏ రాజా, ఎంపీహెచ్ఈఓ రామకృష్ణ పాల్గొన్నారు.

12 నుంచి సీపీఐ జిల్లా మహాసభలు

రాయదుర్గంటౌన్: జిల్లా కేంద్రంలో ఈనెల 12,13తేదీల్లో సీపీఐ జిల్లా మహాసభలు జరుగుతాయని సీపీఐ రాయదుర్గం కార్యదర్శి నాగార్జున తెలిపారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో కరపత్రాలు విడుదల చేశారు. ఏఐఎస్ఎఫ్, రైతుసంఘనేతలు కొట్రేష్, తిప్పేస్వామి,రవి పాల్గొన్నారు.